# వివాదరహిత సినిమాలకు కేరాఫ్ అడ్రస్ కృష్ణంరాజు

## - ఏఎన్‌యు వీసి ప్రొఫెసర్ రాజశేఖర్

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,సెప్టెంబరు12, ప్రభాతవార్త:** ప్రముఖ సినీనటుడు, మాజీ కేంద్ర మంత్రి యు.వి.కృష్ణంరాజు వివాదరహిత చిత్రాలలో నటించేందుకు మొగ్గచూపేవారని ఏఎన్‌యు వీసి ప్రొఫెసర్ రాజశేఖర్ గుర్తుచేసుకున్నారు.



కృష్ణంరాజుకు నివాళులు అర్పిస్తున్న వీసి ప్రొఫెసర్ రాజశేఖర్

సోమవారం వర్సిటీలో కృష్ణంరాజు మృతికి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడేతత్త్వం కృష్ణంరాజుకు ఉందన్నారు. ఉన్నత విలువలగల నటుడుగా ఆదర్శ బావాలను వ్యక్తపరిచే వ్యక్తిగా ఆయన నిలుస్తారని అన్నారు. సమాజం పట్ల ఆయనకున్న సానుకూల ధోరణితో దాదాపు 40 నుంచి 50కుటుంబాలను దత్తత తీసుకుని చదివిస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. రిజిస్ట్రార్ ఆచార్య బండి కరుణ, ఆర్కిటెక్చర్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య పి.సిద్దయ్య, ఓఎస్‌డి డాక్టర్ కె.సునీత, సిడిసి డీన్ డాక్టర్ కె.మధుబాబు, పీజీ, రీసెర్చ్‌సెల్ కోఆర్డినేటర్ ఆచార్య ఎల్.ఉదయకుమార్, గాంధియన్ స్టడీస్ కోఆర్డినేటర్ డాక్టర్ సోమశేఖర్, మెకానికల్ విభాగం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం.గోపీకృష్ణ, అధ్యాపకులు, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మంగళగిరి పోలీస్‌స్టేషన్ ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ ఆకస్మికంగా తనిఖీ

**మంగళగిరి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** గుంటూరు జిల్లా ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ సోమవారం మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీచేశారు.నార్త్ సబ్ డివిజన్ పరిధిలోని మంగళగిరి పట్టణ పోలీస్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు.ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్టేషన్ పరిసరాలను,సిబ్బంది పనితీరును,డ్యూటీల నియామకం,రిసెప్షన్ కౌంటర్ నిర్వహణ,లాకప్ తదితర అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు.అలాగే స్టేషన్‌లో నమోదైన వివిధ కేసులు,ఆయా కేసులకు సంబంధించిన వివరాలను ఎస్‌హెచ్‌ఓ అయిన అంకమ్మరావును అడిగి తెలుసుకున్నారు.అనంతరం పోలీస్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిందిగా మంగళగిరి పట్టణ సీఐ



అంకమ్మరావుకు ఆదేశాలు జారీచేశారు.ఈనెల 15వ తేది నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖల మంత్రులు,శాసనసభ్యులు,శాసనమండలి సభ్యులు,ముఖ్యప్రభుత్వ అధికారులు అసెంబ్లీ సమావేశాల్లో హాజరవుతారు కాబట్టి మంగళగిరి పట్టణ ప్రధాన కూడళ్ళలో ట్రాఫిక్‌కు సంబంధించిన తగు జాగ్రత్తలు తీసుకొని వారికి ట్రాఫిక్ అంతరాయం లేకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని సిఐ అంకమ్మరావుకు ఆదేశాలు జారీచేశారు.మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్ లో పెండింగ్‌లో ఉన్న కోవిడ్ కేసులు,ఎక్సైజ్ కేసులు,పెండింగ్‌లో ఉన్న వారెంట్లు,ఎస్సీ,ఎస్టీ కేసులు, గ్రేవ్ కేసులు మరియు ఇతర ముఖ్యమైన కేసు ఫైల్స్‌ను విశ్లేషించి త్వరితగతిన దర్యాప్తు పూర్తిచేసి చట్టపరంగా చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేకూరేలా కృషిచేయాలని సూచించారు.సాధ్యమైనంత ఎక్కువ కేసులు డిస్పోజల్ చేయాలని సిఐకి ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమంలో మంగళగిరి పట్టణ సిఐ అంకమ్మరావు,ఎస్‌బి సిఐ నరసింహారావు,ఎస్సై మహేంద్ర,ఎస్పీ సిసి శ్రీనివాసరావు,సిబ్బంది పాల్గొన్నారు.

# మహా పాదయాత్రకు కృష్ణాయపాలెంలో ఘనస్వాగతం

**మంగళగిరి, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** అమరావతి నుండి అరసవల్లి వరకు జరగనున్న రాజధాని రైతుల మహాపాదయాత్రకు మంగళగిరి మండలం,కృష్ణాయపాలెం గ్రామంలో సోమవారం ఘన స్వాగతం పలికి పాదయాత్రకు మంగళగిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు సంఘీభావం తెలిపారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ స్థానిక శాసనసభ్యుడు ఆళ్ళ రామకృష్ణారెడ్డి, ఎన్నికల ముందు జగన్‌రెడ్డి ఇక్కడే ఇల్లు కట్టుకున్నారు,ఇదే రాజధాని అని,తీరా గెలిచాక మడమ తిప్పారని విమర్శించారు.జగన్‌రెడ్డి,నిడమర్రు గ్రామంలో జరిగిన పాదయాత్రలో ఇదే రాజధాని అని,మేము అధికారంలోనికి వచ్చిన వెంటనే ఇంకా మెరుగైన రాజధాని నిర్మిస్తామని కల్లబొల్లి మాటలు



చెప్పి ఈ ప్రాంత ప్రజానీకాన్ని మోసం చేశారని ఈ సందర్భంగా గుర్తుచేశారు.అధికార మదం తలకెక్కిన ఆళ్ళ రామకృష్ణారెడ్డి,రాజధానికి భూములిచ్చిన రైతులను రియల్ ఎస్టేట్ బ్రోకర్లని అవహేళన చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు.ఈ ప్రాంత ఓట్లతో గెలిచి,మూడు రాజధానులకు మద్దతు పలికి,తనకు ఓట్లేసిన ప్రజలకు నమ్మకద్రోహం చేసిన వ్యక్తి ఆర్కే అన్నారు.అమరావతి ఏకైక రాజధానిగా,రైతుల పాదయాత్రకు ఒక్క వైఎస్సార్‌సీపీ తప్ప అన్ని పార్టీలు మద్దతు పలికాయని చెప్పారు.అమరావతి రైతుల ఉద్యమం చరిత్రలో నిలిచిపోతుందని అన్నారు.ప్రభుత్వం ఎన్ని అడ్డంకులు సృష్టించినా భరిస్తూ,రైతులు ముందుకు సాగుతున్నారు.రైతుల మహాపాదయాత్ర విజయవంతం కావాలి.మూడు రాజధానులంటూ ప్రాంతాల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్న జగన్‌రెడ్డి,ఈ మూడున్నర సంవత్సరాలు నుండి చేసిన అభివృద్ధి జీరో అని ఎద్దేవ చేశారు.మూర్ఖపు ముఖ్యమంత్రి జగన్ ఇకనైనా కళ్ళు తెరచి,అమరావతి ని ఏకైక రాజధానిగా ప్రకటించాలని పిలుపునిచ్చారు.అమరావతి రైతులు మహాపాదయాత్రలకు స్వాగతం పలికి సంఘీభావం తెలిపిన వారిలో నందం అబద్ధయ్య,తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి,పోతినేని శ్రీనివాసరావు,రాష్ట్ర తెలుగుమహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య,గూడూరు వెంకటరావు,రాష్ట్ర టిడిపి బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు,రాష్ట్ర టిడిపి మైనార్టీ సెల్ కార్యదర్శి అబ్దుల్ మజీద్,గాదె పిచ్చిరెడ్డి,మండల పార్టీ అధ్యక్షులు తోట పార్ధసారధి,తాడేపల్లి పట్టణపార్టీ అధ్యక్షులు వల్లభనేని వెంకటరావు,దుగ్గిరాల మండల పార్టీ అధ్యక్షుడు కేసంనేని అనిత,నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆరుద్ర భూలక్ష్మీ,జంగాల సాంబశివరావు,ఇట్టా భాస్కర్, ఎండి ఇబ్రహీం,బెజ్జం రామకృష్ణారావు,బోగి వినోద్,బొర్రా కృష్ణవందన,అన్నెం కుసుమ

# గుంటూరు వార్త

# యార్డుకు 30వేలకు పైగా మిర్చిబస్తాల రాక

**గుంటూరు, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త :** గుంటూరు మిర్చియార్డుకు వివిధ ప్రదేశాల నుంచి 30,586 బస్తాల మిర్చి సోమవారం అమ్మకానికి యార్డుకు వచ్చాయి.వీటిలో 29,478 బస్తాల మిర్చి అమ్మకాలు జరిగాయి.ఇంకా 6,961 బస్తాల మిర్చి నిల్వఉంది.కామన్ వెరైటీ 334 రకం రూ.7,800నుంచి 25,500వరకు,ఐదవ నంబర్ రకం రూ.19,500నుంచి 22,000 వరకు, 273 నంబర్ రకం రూ.7,800 నుంచి రూ.25,300 వరకు, 341 నంబర్ రకం రూ.16,000 నుంచి 26,500 వరకు, తేజ రకం రూ.7,500నుంచి రూ.23,600వరకు, బాడిగి రూ.10,000 నుంచి 27,000వరకు,తాలురకం రూ.4,200 నుంచి రూ.12,500 వరకు ధరపలికింది.

# స్పందన ఆర్జీలు సత్వరం పరిష్కరించాలి

**గుంటూరు నగర పాలకసంస్థ, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** స్థానిక సమస్యల పరిష్కారం కొరకు ప్రతి సోమవారం నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో నిర్వహించే స్పందనలో వచ్చిన ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని,స్పందన అర్జీలు రీ ఓపెన్ అయితే సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవని విభాగాధిపతులకు నగర కమీషనర్ కీర్తి చేకూరి స్పష్టంచేశారు.సోమవారం నగరపాలక సంస్థ కౌన్సిల్‌సమావేశ మందిరంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా కమీషనర్ తొలుత గతవారం స్పందన ఫిర్యాదులు,స్పందన పోర్టల్,ఈఆర్‌పి, వాట్స్‌ఆప్ ,కాల్ సెంటర్ల ద్వారా అందిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో, సంబంధిత కార్యదర్శులతో సమీక్షించి ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కారించాలని ఆదేశించిరు.సచివాలయాల్లో కూడా ప్రతిరోజు మధ్యాహ్నం 3నుంచి 5గంటల వరకు స్పందన జరగాలని,స్థానిక సమస్యల పరిష్కారం కోసం ప్రజలు సచివాలయాల్లో అర్జీలు అందించాలని,అందిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.అలాగే స్పందనలో వచ్చే అర్జీలను సమగ్ర సమాచారం,మరియు పరిష్కారాలతో నిర్దేశిత గడువులోగా క్లోజ్ చేయాలని,అర్జీదారులకు ఇచ్చే ఎండార్స్‌మెంట్లను విభాగాధిపతులు పూర్తిస్థాయిలో పరిశీలించాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించవద్దని నిర్దేశిత గడువులోగా ఫిర్యాదులు,అర్జీలు పరిష్కరించాల్సిన బాధ్యత విభాగాధిపతులదేనని తెలిపారు.సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో 47ఫిర్యాదులు అందాయని వాటిలో పట్టణ ప్రణాళిక విభాగం 24,ఇంజనీరింగ్ విభాగం 9, ప్రజారోగ్య విభాగం 5, రెవెన్యూ విభాగం 6, ఉపా సెల్ 2, ఎడ్యుకేషన్ 1, ఫిర్యాదులు అందాయని,వాటిని నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమీషనర్ బి.శ్రీనివాస రావు,ఎస్.ఈ.భాస్కర్,సిటి ప్లానర్ మూర్తి, సీఎంఓహెచ్ డాక్టర్ విజయలక్ష్మీ,బయాలజిస్టు మధుసూదన్,ఏసిపిలు,ఆర్‌ఓలు,ఈఈలు,ఎస్ఎస్‌లు పాల్గొన్నారు.



స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమీషనర్ కీర్తి చేకూరి

# బహుజనులకు రాజ్యాధికారం ద్వారానే సామాజిక న్యాయం లభిస్తుంది

**గుంటూరు విద్య, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** బహుజన రాజకీయ ప్రత్యామ్నాయం ద్వారానే బహుజనులకు రాజ్యాధికారం తద్వారా సామాజిక న్యాయం లభిస్తుందని సామాజిక న్యాయకేంద్రం కన్వీనర్ వై.కే.పేర్కొన్నారు.స్థానిక బ్రాడీపేటలోని సిపిఎం కార్యాలయంలోని కొరిటాల మీటింగ్‌హాల్లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో వైకా



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న సామాజిక న్యాయకేంద్రం కన్వీనర్ వైకె

మాట్లాడారు.బహుజనులకు రాజకీయ ప్రత్యామ్నాయం అనే అంశంపై జరిగిన రౌండ్‌టేబుల్‌లో మాట్లాడిన ప్రతిఒక్కరూ వారి అమూల్యమైన సలహాలు అందించారు.నేటి సామాజిక సాంఘీక రాజకీయ పరిస్థితుల్లో బహుజనులకు తప్పకుండా రాజకీయ ప్రత్యామ్నాయం ఉండాలని అభిప్రాయపడ్డారు.సమావేశంలో షేక్ ఖాజావలి,డాక్టర్ అంజయ్య,కృష్ణాంజనేయులు,తాటికొండ నరసింహారావు,జూపూడి శ్రీనివాసరావు,బత్తుల వీరాస్వామి,పాగళ్ళ ప్రకాష్,గంటా ప్రభుదాస్,బూరుగ రత్నం,హేబేలు,అక్బర్,హరిప్రసాద్,గురుమూర్తి,ఆర్.ప్రసన్నకుమారి,కొల్లూరి నాగేశ్వరరావు,షేక్ జలీల్,సీతారమేష్,భాస్కర్‌గౌడ్,కంచర్ల కోటయ్య,పి.కోటేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా

# అమరావతే ఏకైక రాజధాని

**గుంటూరు అర్బన్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** రాజధాని నిర్మాణం కోసం రైతులు చేసిన త్యాగాలు వృదాపోవని ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా అమరావతే అంధ్రప్రదేశ్‌కు ఏకైక రాజధాని అని జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు.అమరావతి రాజధాని రైతులుచేస్తున్న దీక్ష



రైతుల పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న జనసేన నేతలు బోనబోయిన,గాదె తదితరులు

1000రోజులు అయిన సందర్భంగా ఈరోజు "అమరావతి నుండి అరసవల్లి పాదయాత్ర 2.0"వరకు రైతులు పాదయాత్ర ప్రారంభించారు.రైతులు చేస్తున్న మహాపాదయాత్రకు సంఘీభావంగా పాల్గొన్న జనసేన పార్టీ నాయకులు పాదయాత్రలో పాల్గొని వారికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.ఈ సందర్భంగా బోనబోయిన మాట్లాడుతూ రాజు మారినప్పుడల్లా రాజధాని మారదనే విషయాన్ని సిఎం జగన్‌రెడ్డి గుర్తించాలన్నారు.రాజధాని నిర్మాణం కోసం రైతులు చేసిన త్యాగాలు వృధాకావన్నారు.అమరావతినే ఏకైక రాజధానిగా కొనసాగించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును ప్రభుత్వం పెడ చెవిన పెట్టి మూడు రాజధానులు ఏర్పాటు చేస్తామని ప్రకటించడం కోర్టు ధిక్కారమే అవుతుందన్నారు.వైకాపా అధికారం చేపట్టిన నాటి నుండి రాష్ట్రంలో అరాచకం పెరిగిపోయిందని దుయ్యబట్టారు.రానున్న కాలంలో వైకాపాను గద్దె దింపేందుకు ప్రజలు సంసిద్ధమయ్యారని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి చిల్లపల్లి శ్రీనివాసరావు,జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు,జిల్లా నాయకులు అడపా మాణిక్యాలరావు,నారదాసు రామచంద్ర ప్రసాద్,యర్రగోపుల నాగరాజు,శిఖాబాలు,కొర్రపాటి నాగేశ్వరరావు,నెల్లూరు రాజేష్,మహంకాళీ తదితరులు పాల్గొన్నారు.

# బొందిలి కులస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఓబిసి జాబితాలో చేర్చాలి

**గుంటూరు విద్య, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** బిసి జాబితాలో ఉన్న బొందిలి కులస్తులను ఓబిసి జాబితాలో చేర్చేందుకు జగన్మోహనరెడ్డి ప్రభుత్వం రాబోయే అసెంబ్లీ సమావేశాల్లో ఓబిసి బిల్లును ప్రవేశపెట్టాలని బొందిలి సంక్షేమ సేవా సమాజ్ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాథోడ్ సుజాన్‌సింగ్ రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.గంగానమ్మ తల్లి కమ్యూనిటీ హాల్లో జరిగిన బొందిలి సేవా సమాజ్ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు.దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హాయాంలో బొందిలి కులస్తులను బిసి జాబితాలో చేర్చారని ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహనరెడ్డి చేర్చేందుకు రాబయే అసెంబ్లీ సమావేశాల్లో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టాలని దాన్ని ఆమోదానికి తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.బీసీలకు పెళ్ళికానుక పథకాన్ని కొత్తగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తంచేశారు.బొందిలి కులస్తులకు పెళ్ళి కానుక పథకాన్ని రూ.50వేల నుండి రూ.70వేలకు పెంచాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.ఏపిఓబిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అంగిరేకుల వరప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలో ఓబిసిలకు ప్రత్యేక మంత్రిత్వశాఖ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఓబిసి జాబితాలో బొందిలి కులస్తులు చేర్చ లేక పోవడం వల్ల కేంద్ర సర్వీస్ ఉద్యోగాలు,విద్యా రిజర్వేషన్లను బొందిలి కులస్తులు కోల్పోతున్నారని వరప్రసాద్ యాదవ్ ఆవేదన వ్యక్తంచేశారు.ఈ సందర్భంగా బొందిలి సంక్షేమ సేవా సమాజ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశంలో బొందిలి సంక్షేమ వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్లు ఆర్ బాలాజీసింగ్ బొందిలి సుందరిబాయ్,ఆర్ ఝాన్సీ లక్ష్మీబాయి అధ్యక్షులుగా రాథోడ్ సుజాన్ సింగ్ కార్యదర్శిగా బొందిలి శ్రీనివాస్‌సింగ్ ఉపాధ్యక్షులుగా శ్యామ్ శంకర్ సింగ్ కోశాధికారిగా బొందిలిరూప్‌సింగ్ కార్యనిర్వహక కార్యదర్శిగా క్షత్రియ బాలాజి సింగ్ లాలా ప్రసాద్ కార్యవర్గ సభ్యులుగా మహేష్ శ్యామ్ సింగ్ డాక్టర్ సర్దార్‌సింగ్ బొందిలి హరినారాయణ సింగ్ బొందిలి భవాని సింగ్ సంయుక్త కార్యదర్శి కె.నిర్మల్‌సింగ్ హనుమాన్ సింగ్ కిరణ్‌సింగ్ జ్యోతిభాయ్ గౌరవ సలహాదారులుగా తులసీ భవాని సింగ్ రాజపుత్ర సత్యం సింగ్ ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న అంగిరేకుల వరప్రసాద్ యాదవ్

# ఆపదలో ఉన్న జనసైనికులకు వెన్నుదన్నుగ జనసేనాని

**గుంటూరు అర్బన్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** ఆపదలో ఉన్న జనసైనికులకు జనసేన పార్టీ అన్ని విధాలా వెన్నుదన్నుగా ఉంటుందని ఆ పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు.పాతగుంటూరు,ఎన్.ఎం.పేటకు చెందిన దురిశాల భిక్షపతి పొగాకు కంపెనీలో కూలిగా పనిచేసేవాడు.ఈ

**--రాజధాని రైతుల పాదయాత్రకు జనసేన మద్దతు**
**--క్రియాశీలక సభ్యులకు బీమా ధీమా**
**--జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్**

క్రమంలో ఈ ఏడాది ఫిబ్రవరి 22న రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు.ఈ క్రమంలో సోమవారం క్రియాశీలక సభ్యుడైన భిక్షపతికి మంజూరైన రూ.5లక్షల చెక్కును జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ బాధిత కుటుంబానికి అందజేశారు.ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ జనసైనికుల్ని కుటుంబ సభ్యులుగా భావించే తమ పార్టీ వారి కష్టకాలంలో ఆత్మబంధువుగా నిలిచి వారికి అన్ని విధాలుగా అండగా ఉండి భరోసా కల్పిస్తుందన్నారు.కార్యకర్తలను కేవలం రాజకీయం కోసమో,పార్టీ కార్యక్రమాల కోసమో మాత్రమే చేర్చుకునే పద్ధతి మొదటి నుంచి జనసేన పార్టీలో లేదన్నారు. కార్యకర్తల కష్టంలో కన్నీళ్ళు తుడిచేందుకు,వారికి ఆర్థిక దన్ను అందించేలా జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ కల్పించిన ప్రమాద బీమా పథకం తోడుగా నిలుస్తుందన్నారు.రాజు మారినప్పుడల్లా రాజధాని మారదన్నారు.ఆంధ్రప్రదేశ్‌కు అమరావతే ఏకైక రాజధాని అన్నారు.రాజధాని రైతులు చేపట్టిన పాదయాత్రకు జనసేన సంపూర్ణ మద్దతు తెలుపుతుందన్నారు.అమరావతే ఏకైక రాజధాని అని కోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకించే విధంగా సీఎం జగన్ మూడు రాజధానులంటూ దిక్కార ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు.రానున్న దసరా పండుగ రోజున తిరుపతి నుండి ప్రారంభం కానున్న జనసేనాని బస్సుయాత్రకు ఏర్పాటు జరుగుతున్నాయన్నారు.రాష్ట్రంలో వైకాపా రాక్షస పాలనకు చరమ గతీం పాడేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టంచేశారు.ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనబోయిన శ్రీనివాస్ యాదవ్,రాష్ట్ర కార్యదర్శి వడ్రాణమ్ మార్కండేయబాబు,రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండారు రవికాంత్,జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు,నగర అధ్యక్షుడు నేరెళ్ళ సురేష్,జనసేన నేతలు ఉప్పు వెంకట రత్తయ్య,ఆడపా మాణిక్యాలరావు,నారదాసు రామచంద్ర ప్రసాదు,శిఖా బాలు,కొత్తకోటి ప్రసాద్,కటకం శెట్టి విజయలక్ష్మీ,ఆసియా,మాధవి,జనగాం మల్లేశ్వరీ,పాకనాటి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న జనసేన పిఏసి చైర్మన్ నాదెండ్ల మనోహర్

# ఆత్మహత్యల నివారణ నేటి సమాజం ముందున్న భాధ్యత

**గుంటూరు కల్చరల్, సెప్టెంబర్ 12, ప్రభాతవార్త :** ఆత్మహత్యల నివారణ నేటి సమాజం ముందున్న కీలక సవాళ్ళలో ఒకటని,సమాజంలో,జీవితంలో ఎదురయ్యే ఆటుపోట్లను ఎదుర్కొలేక బలవంతంగా ప్రాణాలు తీసుకుంటున్న వారు పెరిగిపోవడం ఆందోళన చెందాల్సిన విషయమని అవగాహన సంస్థ



నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మానసిక వైద్య నిపుణులు,విశ్లేషకులు అభిప్రాయపడ్డారు.కార్యక్రమంలో ప్రముఖ మానసిక వైద్యుడు డాక్టర్ కె.సురేష్‌కుమార్ మాట్లాడుతూ ఉరుకుల,పరుగుల జీవితాల్లో మనుషులు విపరీతమైన ఒత్తిడికి గురై విలువైన ప్రాణాలు తీసుకుంటున్నారన్నారు.విశ్లేషకులు చంద్రయ్య మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 10న ఆత్మహత్యల నివారణ దినంగా పాటించాలని ప్రకటించిందన్నారు.కార్యక్రమంలో కృష్ణ,పి.ఎస్.మూర్తి,తదితరులు ప్రసంగించారు.

## చెన్నుపాటి గాంధీని పరామర్శించిన మాజీమంత్రి ప్రత్తిపాటి

**చిలకలూరిపేట, సెప్టెంబరు12,ప్రభాతవార్త:** విజయవాడకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు, టిడిపి కార్పొరేటర్ చెన్నుపాటి గాంధిపై ఇటీవల వైసిపి నాయకులు దాడిచేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన విదితమే. కాగా ఈ సంఘటనలో గాంధీ కుడికంటికి తీవ్రగాయమై హైదరాబాద్ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రిలోచికిత్స చేయించుకున్నారు. కాగా సోమవారం చెన్నుపాటి గాంధీ నివాసానికి వెళ్లి ఆయనను ప్రత్తిపాటి పరామర్శించారు. కంటికి జరిగినటువంటి శస్త్రచికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. అన్నివిధాల పార్టీ అండగా ఉంటుందని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. అధైర్యపడవద్దని త్వరగా కోలుకుంటారని ఆకాంక్షించారు. దాడిచేసిన వారిని వదిలే ప్రసక్తేలేదని, ఈ సంఘటనలో ఉన్నవారు ఎంతటివారైనా న్యాయస్థానం ముందు దోషులుగా నిలబెడతామని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

## ప్రభుత్వ పాఠశాలలలో డ్రాప్‌ఔట్స్‌పై ప్రధానోపాధ్యాయులతో సమావేశం

**చిలకలూరిపేట, సెప్టెంబరు12,ప్రభాతవార్త:** చిలకలూరిపేట పట్టణం, మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో సోమవారం పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో పాఠశాలలలో డ్రాప్‌ఔట్స్ పై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా చిలకలూరిపేట



ప్రధానోపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమీషనర్ సిహెచ్ గోవిందరావు

మున్సిపల్ కమిషనర్ చక్కల గోవిందరావు పాల్గొని ప్రసంగిస్తూ ప్రభుత్వ పాఠశాలల డ్రాప్‌ఔట్స్ ,మరియు వీధిబాలలను, ఇంటింటి సర్వే చేపట్టవలసినదిగా కోరారు. బడిమానుకొని పనికి వెళ్లే పిల్లలను గుర్తించి ఆయా విద్యార్థులను తిరిగి బడికి వచ్చేవిధంగా చర్యలు తీసుకోవలసినదిగా ప్రధానోపాధ్యాయులకు సూచించారు. దీనికి సంబంధించి ప్రధానో పాధ్యాయులు, సచివాలయ మహిళా పోలీసులు, వార్డు ఎడ్యుకేషన్ కార్యదర్శులు, వార్డు ప్లానింగ్ కార్యదర్శులు అందరూ ఆయా సచివాలయ పరిధిలో గ్రూప్ గా ఏర్పడి ఈ నెల 13వ తేదీలోగా ఇంటింటికి తిరిగి సర్వేచేపట్టవలసినదిగా కమీషనర్ సూచించారు. ఈ సమావేశంలో చిలకలూరిపేట యంఇఒ. కె లక్ష్మీ, యంపిడిఒ. హేమలత, టిపియస్ సునీత, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## 17వ వార్డులో పర్యటించి సమస్యలు తెలుసుకున్న కమీషనర్

**చిలకలూరిపేట, సెప్టెంబరు12,ప్రభాతవార్త:** పట్టణంలోని 17వ వార్డులో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపల్ కమిషనర్ చక్కల గోవిందరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన వార్డు పరిధిలోని అన్ని



17వ వార్డులో సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న మున్సిపల్ కమీషనర్ చుక్కల గోవిందరావు

వీధులలోని మురుగు కాలువలను, రోడ్లను పరిశీలించారు. కమీషనర్ తో పాటు కార్యక్రమంలో పాల్గొన్న ఇంజనీరింగ్ విభాగం వారితో మాట్లాడుతూ మురుగునీరు మంచినీటి పైపులైనులనందు కలువకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. అదే విధంగా వార్డు హెల్త్ కార్యదర్శులు, సిబ్బంది వర్షాకాల పరిస్ధితులను దృష్టిలో ఉంచుకొని ప్రజలకు సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య అధికారి శ్రీనివాసరావు, వైసిపి నాయకులు భరత్, మోషే, ఊసా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## దళిత బహుజన ఫ్రంట్ వారిచే గడ్డంపాల్ విజయకుమార్‌కు అవార్డు

**చిలకలూరిపేట, సెప్టెంబరు12,ప్రభాతవార్త:** డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భావజాలంతో జాతి జనులకు అండగా, అందుబాటులో ఉంటూ మానవహక్కుల పరిరక్షణకు అంకితభావంతో కృషిచేస్తున్నందుకు చుండూరు దళితపల్లెవీరుడు కె అనీల్‌కుమార్ స్ఫూర్తితో దళితవీర్ అవార్డును వేలూరు కేర్స్ సంస్థ అధ్యక్షుడు గడ్డంపాల్ విజయకుమార్‌కు గుంటూరులో జరిగిన కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ జాతీయ అద్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావులు అందచేశారు.



## ఘనంగా గణపవరం గణేష్ నిమజ్జనం

**నాదెండ్ల, సెప్టెంబరు12,ప్రభాతవార్త:** మండలంలోని గణపవరం గ్రామంలో గణేషుని ఉత్సవాలు గత 11 రోజులుగా ఎయంబి ఫ్రెండ్స్, బాలగణేష్ యూత్ ఆధ్వర్యంలో జరిగాయి. కాగా ఆదివారం రాత్రి గణేషుని విగ్రహన్ని కోలాహలంగా భారీ మేళతాళాలతో నిమజ్జనం చేయటానికి మున్సిపల్ ప్రతిపక్ష నాయకుడు గంగా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తోడ్కొని వెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ట్రాక్టర్ ముందుభాగాన ఎర్పాటుచేసిన యన్‌టీఆర్ విగ్రహలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

## మొండబండ సంఘం కమ్యునిటి హల్ నిర్మాణంకు స్థలం అందజేత

**చిలకలూరిపేట, సెప్టెంబరు12,ప్రభాతవార్త:** పట్టణంలోని మదర్‌థెరిస్సా కాలనీకి చెందిన జై హనుమాన్ మొండిబండ సంఘమునకు రూ 5 లక్షల విలువచేసే స్థలాన్ని ఉచితంగా టిడిపి నాయకుడు జంగా వినాయకరావు, టిడిపి 38వ వార్డు కౌన్సిలర్ జంగా సుజాత సోమవారం దానంగా ఇచ్చారు. ఈ సందర్భంగా జంగా వినాయకరావు మాట్లాడుతూ జై హనుమాన్ మొండిబండ సంఘం వారు గత 30 సంవత్సరాలుగా కమ్యూనిటి హాలులేక ఇబ్బందిపడుతున్నారని, వారు ఈ విషయాన్ని తన దృష్టికి, 38వ వార్డు కౌన్సిలర్ జంగా సుజాతగారి దృష్టికి తీసుకురావటం జరిగిందని, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావుగారి స్ఫూర్తితో జై హనుమాన్ మొండిబండ సంఘం వారికి రూ5 లక్షలు విలువచేసే స్థలాన్ని విరాళంగా ఇవ్వడం జరిగిందని ఈమేరకు దస్తావేజులను ఆ సంఘ సభ్యులకు అందచేసినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా సంఘసభ్యులు జంగా వినాయకరావు దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో ఆరికట్ల భూలక్ష్మీ, షేక్ నాగూర్‌మీరా, రమావత్, దుర్గా నాయక్, కుప్పాలవెంకట్రావు,త్రివేణి పాల్గొన్నారు.



## టిడిపి రాష్ట్ర డాక్టర్‌సెల్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ముప్పాళ్ల నియామకం

**చిలకలూరిపేట, సెప్టెంబరు12,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర డాక్టర్‌సెల్ ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ముప్పాళ్ల హనుమంతురావు నియమితులయ్యారు. ఈ మేరకు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు డాక్టర్ ముప్పాళ్లకు నియామక పత్రం అందచేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముప్పాళ్ల మాట్లాడుతూ రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షుడు, మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సహకారంతో తనకు ఈ పదవి లభించినట్లు తెలిపారు. కాగా డాక్టర్ ముప్పాళ్ల చిలకలూరిపేటలో జానకీ నర్సింగ్‌హోమ్‌ను గత 40 సంవత్సరాలుగా నడుపుతున్నారు. గతంలో కాంగ్రెస్ పార్టీలో ఉంటూ పార్టీ తరుపున చిలకలూరిపేట నియోజకవర్గ శాసనసభ అభ్యర్థిగా పోటీచేశారు. కాంగ్రెస్ పార్టీ డాక్టర్ సెల్ అద్యక్షుడిగా కూడా పనిచేశారు. తరువాత 2019 ఎన్నికలకు ముందు తెలుగుదేశం పార్టీలో డాక్టర్ ముప్పాళ్ల చేరారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఉన్న డాక్టర్ ముప్పాళ్ల పార్టీ వ్యవహారాలలో చురుకుగా పాల్గొనడంతో ఆయనను డాక్టర్ సెల్‌లోకి తీసుకోమని ప్రత్తిపాటి చంద్రబాబును కోరారు. దీనితో చంద్రబాబునాయుడు ఆయన సేవలను వినియోగించుకోవాలనే ఉద్దేశంతో డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ సందర్భంగా డాక్టర్ ముప్పాళ్ల నారా చంద్రబాబునాయుడికి, ప్రత్తిపాటికి కృతజ్ఞతలు తెలియచేశారు.

## పారిశ్రామిక వేత్తలతో సమావేశం

**పొన్నూరు, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** ఆర్టీసికి సబంధించిన ఖాళీ స్థలాన్ని లీజుకు ఇవ్వడం ద్వారా సంస్థకు కొంత మేర ఆదాయం సమకూరుతుందని విజయ గీత అన్నారు. స్థానిక డిపో మేనేజర్ కార్యాలయంలో సోమవారం ఆమె ఆసక్తి గల పారిశ్రామిక వేత్తలతో మాట్లాడారు. ఆర్టీసి సంస్థ నష్టాల్లో ఉన్నప్పటికీ ప్రజా సేవ పరమావధిగా పనిచేస్తోందన్నారు. లక్షలాది మంది ప్రయాణీకులను తమ గమ్యస్థానాలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేరవస్తుందన్నారు. అలాంటి సంస్థ నష్టాల నుంచి గట్టెక్కించేందుకు ప్రయత్నం చేస్తున్నామన్నారు. అందులో భాగంగా స్థానిక డిపోకు చెందిన 1.5ఎకరాల స్థలాన్ని లీజుకి ఇచ్చేందుకు నిర్ణయించామన్నారు. పారిశ్రామిక వేత్తలు ముందుకు వచ్చి స్థలాన్ని వేలంపాటలో పొందాలన్నారు పదిహేను సంవత్సరాల కాల పరిమితికి అద్దె ప్రాతిపదికన ఇవ్వనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధించిన నిబంధనలను తెలియజేశారు. సమావేశంలో డిపో మేనేజర్ తోట శ్రీనివాస్, పారిశ్రామిక వేత్తలు ఆకుల సాంబశివరావు, అంబటి వెంకటేశ్వరరావు, తోట ప్రసాద్, అమిరినేని సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్టీసి జిల్లా డిపిటిఓ విజయ గీత తదితరులు

## 26నుంచి పుణ్యతిథి ఉత్సవాలు

**పొన్నూరు, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** పట్టణంలోని సాయినగర్‌లో వేంచేసియున్న శ్రీ షిరిడి సాయి మందిరంలో ఈ నెల 24వ తేదీ నుంచి వచ్చే నెల ఐదవ తేదీ వరకు 104వ పుణ్యతిథి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు శ్రీ షిరిడి సాయి సేవా మండలి ఛైర్మన్ ఎఆర్‌కెఎస్టీ సాయి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీన బాబా పుణ్యతిథి, 6వ తేదీన నగరోత్సవం, 9వ తేదీన అన్న సంతర్పణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఉత్సవాల సందర్భంగా కుంకుమార్చనలు, ధునిపూజలు, సామూహిక సాయిసచ్చరిత్ర పారాయణ, సాయి చాలీసా, విష్ణు సహస్రనామపారాయణ, లలితా సహస్రనామపారాయణ, తదితర ఆధ్యాత్మిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని, బాబా కృపకు పాత్రులు కావాలని ఎఆర్‌కెఎస్టీ సాయి కోరారు

## అంతర్జాతీయ సమ్మిట్‌లో పాల్గొన్న నరేంద్రకుమార్

**పొన్నూరు, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** అంతర్జాతీయ పాడిపరిశ్రమాభివృద్ధి రంగంలో వస్తున్న మార్పులు, ప్రపంచ మానవాళికి పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించడానికి చేపట్టాల్సిన



ఐడిఎఫ్ వరల్డ్ సమ్మిట్‌లో పాల్గొన్న సంగం డెయిరీ ఛైర్మన్, ప్రతినిధుల బృందం

చర్యలు తదితర అంశాలపై చర్చించేందుకు జరుగుతున్న అంతర్జాతీయ పాడిపరిశ్రమ రంగ వార్షిక సమావేశంలో సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్, డెయిరీ ప్రతినిధుల బృందం పాల్గొన్నారు. 48సంవత్సరాల తర్వాత భారతదేశంలో జరుగుతున్న అంతర్జాతీయ సమ్మిట్‌ను ప్రధాని నరేంద్రమోడి సోమవారం ప్రారంభించారు. పాడిపరిశ్రమ రంగ అభివృద్ధి, సాంకేతికంగా వస్తున్న మార్పులు, భవిష్యత్తులో అంతర్జాతీయంగా మానవాళికి పోషకాహారం అందించడంలో పాడిపరిశ్రమ రంగానికి ఎదరయ్యే సవాళ్ళకు అనుగుణంగా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సమావేశాలు నాలుగు రోజులపాటు జరగనున్నాయి. ఈ సమావేశంలో అంతర్జాతీయంగా వివిధ దేశాలకు చెందిన 1500మంది పాడిపరిశ్రమాభివృద్ధి రంగ నిపుణులు సమావేశంలో పాల్గొంటారు. సంగం డెయిరీ తరపున ఛైర్మన్ నరేంద్రతోపాటు యండి గోపాలకృష్ణ, పదిమంది పాలకవర్గ సభ్యులు సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

## వ్యర్థాల నుంచే విలువైన ఉత్పత్తులు

**- సైంటిస్ట్ డాక్టర్ హెచ్‌వీసీ చారీ గుంటుపల్లి**

**పొన్నూరు, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** పరిశ్రమల నుంచి వెలువడిన వ్యర్థాల రీసైక్లింగ్ వల్ల వాతావరణ కాలుష్యం అరికట్టడమే కాకుండా వాటి నుంచి విలువైన ఉత్పత్తులను తయారు చేయవచ్చునని భోపాల్‌లోని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ అడిషనల్ డైరెక్టర్, సైంటిస్ట్ ఈ డాక్టర్ హెచ్‌వీసీ చారీ గుంటుపల్లి అన్నారు. చేబ్రోలు మండల పరిధి వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని డిపార్టుమెంట్ ఆఫ్ ఆయోటెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో సర్క్యులర్




బయో ఎకానమీ అండ్ బయోఇంజనీరింగ్ అప్రోచెస్ ఫర్ ఏ క్లీన్ ఎన్విరాన్‌మెంట్ అండ్ హెల్త్ అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగిన జాతీయస్థాయి కాన్ఫరెన్స్ ఘనంగా ముగిసింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భోపాల్‌లోని మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ ఫారెస్ట్ అండ్ క్లైమేట్ చేంజ్ అడిషనల్ డైరెక్టర్, సైంటిస్ట్ ఈ డాక్టర్ హెచ్‌వీసీ చారీ గుంటుపల్లి మాట్లాడుతూ ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మొత్తం సహజ వనరుల వినియోగం మీదే అధారపడి ఉందన్నారు. సహజ వనరుల అధిక వినియోగం వల్ల ప్రపంచ దేశాలు ఆర్థికంగా ఎంతో అభివృద్ధి చెందుతున్నాయో...అదే సమయంలో వాతావరణంలో పారిశ్రామిక వ్యర్థాలు కూడా అంతే ఎక్కువగా అభివృద్ధి చెందుతున్నాయన్నారు. దీనివల్ల అనుదినము సమాజంలో అనేక కొత్త అనారోగ్య సమస్యల ఉత్పన్నమవుతున్నాయన్నారు. బయో హైడ్రోజన్, బయో ప్లాస్టిక్స్, మాలిక్యూల్స్ మొదలగు ఉత్పత్తుల ద్వారా సహజవనరులను అందించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన గుజరాత్‌లోని ఇంజ్యూనిటీ బయోసైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈఓ డాక్టర్ కె.రవి మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో బయోమాలిక్యూల్స్ అనాలిసిస్‌కు బయోటెక్నాలజీ పరిశ్రమలలో అత్యధిక అవకాశాలు ఉన్నాయని విద్యార్థులకు తెలియజేశారు. బయో మాలిక్యూల్స్ కార్యక్టరైజేషన్స్ విధానాలలో విద్యార్థులు పరిశోధనలు చేయడం ద్వారాజీవితంలో స్థిరమైన అభివృద్ధి సాధించవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ వీసీ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, బయోటెక్నాలజీ డిపార్టుమెంట్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలం

**- టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు**

**పొన్నూరు, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** ధరల నియంత్రణలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు బండ్లమూడి బాబూరావు అన్నారు. మండల పరిధిలోని గోళ్ళమూడిపాడు గ్రామంలో సోమవారం బాదుడే బాదుడు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ వైఫల్యాలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బండ్లమూడి బాబూరావు మాట్లాడుతూ నిత్యావసర వస్తువులు ఆకాశన్నంటుతున్నా ప్రభుత్వం పట్టించు కోకపోవడం దురదృష్టకరమ న్నారు. అన్ని రాష్ట్రాలలో డీజిల్, పెట్రోలుపై ధరలు తగ్గిస్తే జగన్మోహనరెడ్డి మాత్రం ఒక్క పైసా కూడా తగ్గించకపోగా అనేక పన్నులు విధిస్తూ పేద ప్రజల నడ్డి విరుస్తున్నారన్నారు. జగన్మోహనరెడ్డి చేష్టల వల్ల ధనవంతుల కంటే పేదలకే నష్టం ఎక్కువగా జరుగుతుందన్నారు. ప్రజలందరూ ఈ ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలపై ఆలోచన చేసి రానున్న రోజుల్లో వైకాపాకు బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మాదల వెంకటేశ్వరరావు, ఉప్పల శివ, నాగేశ్వరరావు, ఖగ్గా వెంకటకృష్ణ, సముద్రాల ఆశీర్వాదం, మున్నంగి సుబ్బారెడ్డి, చలమశెట్టి సీతారామయ్య, మండవ గౌతమ్, పెందుర్తి శ్రీనివాస్, బుడ్డా బీరయ్య తదితరులు పాల్గొన్నారు.



బాదుడే బాదుడు కరపత్రాలను పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

## ముస్లీం పక్షపాతి సిఎం వైఎస్ జగన్

**పొన్నూరు, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** ముస్లీంల సంక్షేమం కోసం అనేక సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేయడంతోపాటు మంత్రి వర్గంలో కూడా పలువురికి ప్రాధాన్య కల్పించి ముస్లీం పక్షపాతిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి నిలిచారని దివంగత షేక్ కార్పోరేషన్




ఛైర్మన్ షేక్ యాసిన్ తనయకుడు షేక్ సైఫుల్లా అన్నారు. స్థానిక ఐలాండ్ సెంటర్‌లో సోమవారం ముస్లీం మైనార్టీలకు షాదీ తోఫా ప్రకటించిన నేపథ్యంలో సీఎం జగన్మోహనరెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం(ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య వర్గం) నిర్వహించారు ఈ సందర్భంగా షేక్ సైఫుల్లా మాట్లాడుతూ నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ ముస్లీం అభివృద్ధికి కృషి చేస్తే, నేడు ఆయన తనయుడు జగన్మోహనరెడ్డి ముస్లీం అభివృద్ధికి షాదీ తోఫా ప్రవేశపెట్టడం సంతోషదాయమన్నారు. టిడిపి ప్రభుత్వం ముస్లీంలకు ప్రాధాన్యత ఇవ్వకుండా వివక్షకు గురిస్తే, జగన్మోహనరెడ్డి తన మంత్రి వర్గంలో ముస్లీంలకు మంత్రి పదవులు ఇవ్వడంతోపాటు నామినేటెడ్ పోస్టుల్లో కూడా ముస్లీంలకు ప్రాధాన్య కల్పించారన్నారు. ముమ్మాటికి ముస్లీంకు న్యాయం చేసిన వ్యక్తిగా జగన్మోహనరెడ్డి ముస్లీంల మనస్సులో సుస్థిర స్థానాన్ని సంపాదించారన్నారు. జగన్మోహనరెడ్డికి కృతజ్ఞతగా ఆయన చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆకుల వెంకటేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి డైరెక్టర్ బొద్దులూరి రంగారావు, మాజీ జడ్పిటీసీ కోటా శ్రీనివాసరావు, అంజుమన్ కమిటి ఛైర్మన్ షేక్ మహ్మద్(మాము), కొల్లేరు శ్రీనివాసరావు, మోపర్తి ప్రమీల, మంద్రు అనిత, అంబటి వెంకటేశ్వరరావు, ఆరేటి మధుసూధనరావు, చిగురుపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

## 15న జిల్లా కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా

**పొన్నూరు, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** ఈ నెల 15వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద జరిగే ధర్నాలో తాము పాల్గొంటామని తెలియజేస్తూ మునిసిపల్ కార్మికులు మునిసిపల్ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీల మేరకు మునిసిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంక్షేమ పథకాలు కొనసాగించాలని, స్కిల్డ్, సెమిస్కిల్డ్ జీతాలు చెల్లించాలని తదితర డిమాండ్ల సాధనకు ధర్నా నిర్వహించనున్నట్లు చెప్పారు. వినతిపత్రం అందజేసినవారిలో సిఐటియు జిల్లా అధ్యక్షుడు దండా లక్ష్మీనారాయణ, మండల కార్యదర్శి నిమ్మకూరి రమేష్‌బాబు తదితరులున్నారు.

## 14న సామూహిక ఎలుకల నివారణ మందు పంపిణీ

**పొన్నూరు, సెప్టెంబర్ 12,ప్రభాతవార్త:** ఎలుకల నివారణకు వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఎలుకల నివారణ మందును ఈ నెల 14 తేదీన పంపిణీ చేయనున్నట్లు వ్యవసాయ సహాయ సంచాకులు సిహెచ్ తిరుమలాదేవి తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు. వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలోని పొన్నూరు, చేబ్రోలు మండలాల్లో అన్ని రైతు భరోసా



కేంద్రాలలో సామూహిక ఎలుకల నివారణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బ్రోమోడిలోన్ మందుని(2శాతం),, నూక(96శాతం), నూనె(2శాతం చొప్పున ఎలుకల ఎర మందును రైతు భరోసా కేంద్రాల వద్ద తయారు చేసి రైతులకు ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రైతులందరూ తమ పొలాల్లో ఉన్న బొరియలలో ఒక్కో బొరియకు 10గ్రాముల చొప్పున ఎలుకల ఎరను ఉంచి పేపరుతో చుట్టి, బొరియల దగ్గర ఉంచాలన్నారు. ఎకరాకు 20 వరకు బొరియలు ఉంటాయని తెలిపారు. ఆ రోజు కలిపిన ఎలుకల ఎర మరుసటి రోజుకు పనికిరాదని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సమావేశంలో వ్యవసాయాధికారి డేగల వెంకట్రామయ్య పాల్గొన్నారు.

# పంటల దిగుబడులపై రైతుల ఆశలు...

**కొల్లిపర-ప్రభాతవార్త:** వరుణుడి కరుణించటంతో పంటలు కళకళలాడుతున్నాయి.గత పదిరోజుల నుంచి మండలంలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో పంటలు జీవంపోసుకున్నాయి. మండలంలోని కొల్లిపర,వల్లభాపురం, మున్నంగి,పిడపర్రు,పిడపర్తిపాలెం,బొమ్మువానిపాలెం, దావులూరు వారిపాలెం,తూములూరు గ్రామాల పరిధిలోని మెట్టప్రాంతాలలో పసుపు,కంద,అరటి పంటలు సుమారు 3600 ఎకరాలు విస్తీర్ణం రైతులు సాగుచేపట్టారు.అన్నవరం,అన్నవరం గౌడపాలెం పంటపొలాలలో 225 ఎకరాలు విస్తీర్ణం కూరగాయల సాగు చేసారు.గత 10 సంవత్సరాల క్రితం పసుపుకు అనూహ్యంగా రూ.17 వేలు ధర పలికి రికార్డు సృష్టించిన విషయం అందరికీ తెలిసిందే.ఆ తరువాత కాలక్రమేణా పసుపుకు ధరలు తగ్గి కేవలం క్వింటా పసుపు రూ.3 వేలలోకి పడింది.దీంతో కొందరు రైతులు డీలా పడ్డారు.పసుపు సాగు అంటేనే విసుకు చెందారు.మరికొందరు రైతులు మాత్రం క్రమం తప్పకుండా పసుపుసాగు చేస్తునే ఉన్నారు.కాలం కలిసి రాకపోతుందా..మరలా పసుపుకు మంచి ధరలు రాకపోతాయా. ..అదృష్టం పట్టకపోతుందా..అనే ఆలోచనలో పసుపు సాగుపై మక్కువ పెంచుకుని ఖర్చుకు వెనుకాడకుండా సాగు చేస్తున్నారు.ఇదిలా ఉంటే కూరగాయలు సాగుకు పెట్టింది పేరుగా నిలిచిన అన్నవరం,అన్నవరం గౌడపాలెం గ్రామాల పంట పొలాలలో కూరగాయలు తోటలు వర్షాలకు ఏపుగా పెరుగుతున్నాయి.చిరుజల్లులకు రోజుకో విధంగా పంట స్వరూపాలు మారటంతో మంచి దిగుబడులు అందవచ్చని తెలుపుతున్నారు.పండించిన కూరగాయలను చుట్టు ప్రక్కల పట్టణాలు అయిన తెనాలి,గుంటూరు, మంగళగిరి,విజయవాడ వంటి పట్టణాలకు తీసుకెళ్ళి రైతులు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు.కందసాగుకు ప్రస్తుత వాతావరం అనుకూలంగా ఉండటంతో పంట పెరుగుదల బాగుంది.అరటి పంటలు సీజన్ పూర్తి అయిపోయినప్పటికీ మరలా సీజన్ రావటానికి నెల పడుతుంది.వర్షాలకు పంటలు బాగా పెరిగి గెలలు వచ్చి మరో నెల రోజులలో మార్కెట్‌కు రావటానికి సిద్ధంకాబోతున్నాయి.ఖరీఫ్‌లో సాగుచేపట్టిన వరి వరుణుడి కరుణతో ఊపిరిపీల్చుకున్నాయి.ఏపుగా పెరగటంతో ముదురు నాటులు వేసిన కొందరురైతులు ఇప్పటికే రెండవ దఫాగా ఎరువులు కూడా వేస్తున్నారు.మండలంలో ఈ ఏడాది వెద పద్ధతిలో ఎక్కువ విస్తీరణం వరిసాగు చేపట్టారు.ప్రస్తుతం ఉన్న వాతావరణానికి పంటలు బాగుండటంతో దిగుబడులు ఆశాజనంగా రావచ్చని రైతులు భావిస్తున్నారు .ఏదైనా పంటలు బాగుండి మంచి దిగుబడులు రావాలని..రైతుల లోగిళ్ళు నిండాలని..ఆనందమైన సంక్రాంతిని ప్రతి కుటు ంబం జరుపుకోవాలని కోరుతుందాం.....

రైతులు

